# చెరువుల్లో చెంగు చెంగున

## నీటి వనరుల్లో పెరుగుతున్న మత్స్యసంపద

వృత్తిదారులను ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలకు శ్రీకారం చుట్టింది. మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించేందుకు వందశాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాది కూడా ఆగస్టులో చెరువుల్లో ఉచితంగా చేపల సీడ్ వదిలే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. అక్రమాలకు తావు లేకుండా పక్కా ప్లాన్‌తో మత్స్యశాఖ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 161 పెద్ద, 954 చిన్న చెరువులు ఉన్నాయి. ఉచిత చేప పిల్లలు వదిలేందుకు జిల్లాలోని 790 చెరువులను ఎంపిక చేశారు. వీటిల్లో 3.10 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందుకు గానూ రూ.3 కోట్లతో రెండు రకాల చేప పిల్లల సీడ్‌ను కొనుగోలు చేశారు. 35 ఎంఎం నుంచి 40 ఎంఎం పరిమాణం ఉన్న 1.91 కోట్ల చేప పిల్లలను ఒక్కో చేప పిల్లకు 65 పైసలకు కొనుగోలు చేశారు. దాంతో పాటు 80 నుంచి 100 ఎంఎం వరకు ఉన్న 1.15 కోట్ల చేప పిల్లలను ఒక్కొక్కటి రూ. 1.62 చొప్పున కొనుగోలు చేశారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ)



- వందశాతం సబ్సిడీతో పంపిణీ
- యాదాద్రి జిల్లాలో పంపిణీ ప్రక్రియ పూర్తి
- 711 చెరువుల్లో 2.82 కోట్ల సీడ్ వదిలిన అధికారులు
- ఏటా పెరుగుతున్న మత్స్య సంపద



చేప పిల్లలను వదులుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారులు, మత్స్య సొసైటీ సభ్యులు (ఫైల్)

### చేప పిల్లల పంపిణీ ఇలా..

| సైజ్ | చెరువులు | సీడ్ |
|---|---|---|
| 35-40ఎంఎం | 604 | 1,70,91,369 |
| 80-100ఎంఎం | 107 | 1,11,33,800 |
| మొత్తం | 711 | 2,82,25,169 |

### చెరువుల్లోకి 2.82 కోట్ల చేప పిల్లలు

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 711 చెరువుల్లో 2,82,25,169 చేప పిల్లలను అధికారులు విడుదల చేశారు. ఇందులో 604 చెరువుల్లో 35 నుంచి 40 ఎంఎం పరిమాణం ఉన్న 1,70,91,369 సీడ్, 107 చెరువుల్లో 80 నుంచి 100 ఎంఎం సైజ్ ఉన్న 1,11,33,800 సీడ్‌ను వేశారు. కొన్ని చెరువుల్లో సరిపడా నీరు లేకపోవడంతో సీడ్ వేయలేదని అధికారులు చెబుతున్నారు. సీడ్ వేసిన చెరువుల్లో చేప పిల్లల పరిమాణం పెరిగింది. అనేక చోట్ల పావుకిలో నుంచి అరకిలో వరకు పెరిగాయి. మార్చి, ఏప్రిల్ వరకు కిలో వరకు పెరిగే అవకాశం ఉంది. అప్పుడు మత్స్యకారులు వలలు వేసి చేపలు పట్టుకొని విక్రయించుకునేందుకు వీలు కలుగనుంది.

### మత్స్యకారులకు జీవనోపాధి

ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు ఒట్టిపోయేవి. చెరువుల్లో నీరు లేపోవడం, మరికొన్ని చెరువుల్లో నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి లభించకపోయేది. దాంతో కొందరు మత్స్యకారులు వలసలు పోగా.. మరి కొందరు ఇతర పనులు చేసుకునేవారు. కానీ తెలంగాణ ఏర్పాటయ్యాక వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం తీసుకొచ్చి చెరువుల్లో పూడిక తీత, కట్టల ఆధునీకరణ పనులు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 900 చెరువులను పటిష్టం చేశారు. ఫలితంగా కాలంతో సంబంధం లేకుండా చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. వీటిల్లో ఉచితంగా చేపల పిల్లలను విడుదల చేస్తుండడంతో ఎంతో మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తున్నది. జిల్లాలో142 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 10 మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ద్వారా 8,929 మంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. వీరే కాకుండా సభ్యత్వాలు లేని మరి కొందరికి పరోక్షంగా ఉపాధి లభిస్తున్నది.

### సబ్సిడీపై వాహనాలు, ఇన్‌పుట్స్

చెరువుల్లో ఉచితంగా వేసిన చేప పిల్లలు పెద్దవయ్యాక పట్టి విక్రయించుకునేందుకు వీలుగా మత్స్యకారులకు గత ప్రభుత్వం సబ్సిడీ వాహనాలతో పాటు ఇతర ఉపకరణాలను అందించింది. సమీకృత అభివృద్ధి పథకం ద్వారా 75 శాతం సబ్సిడీతో 20 రకాల యూనిట్లు పంపిణీ చేసింది. ద్విచక్రవాహనాలతో పాటు, వలలు, క్రేట్లు, లగేజీ ఆటోలు, మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లు వంటి యూనిట్లను అందించింది. దాంతో పాటు మత్స్యకారులకు బ్యాంకురుణాలు సైతం ఇచ్చింది. మంచినీటి చేప హెచరీస్, చేపల పెంపకానికి పాండ్స్, రీసర్క్యులేటర్ ఆక్వాకల్చర్ సిస్టం, కేజ్ కల్చర్, ఇన్సులేటెడ్ వాహనాల సరఫరా, ట్రైసైకిల్ సరఫరా, చిన్నతరహా చేప దాణా మిల్లుల ఏర్పాటు, చేపల విక్రయ కేంద్రాలు, చేపల పెంపకానికి ఇన్‌పుట్స్ అందించింది.

### బీమా సౌకర్యం

చేపల వేటను నమ్ముకొని వృత్తిని కొనసాగిస్తున్న వారికి ప్రమాద బీమా కూడా గత ప్రభుత్వం అందించిది. వృత్తిలో భాగంగా నీటమునిగినా, ఇతర ప్రమాదాల్లో చనిపోయినా, వైకల్యం పొందినా బీమా అందుతున్నది. మత్స్యకార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, వైకల్యం పొందితే 2.5 లక్షల పరిహారం ఇస్తున్నారు. ఇందుకోసం మత్స్యకారులు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. సహకార సంఘాల్లో సభ్యులై ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుంది.



### 2.82కోట్ల సీడ్ వదిలాం..

ఈ ఏడాది ఆగస్టులో ఉచిత చేపల పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాం. జిల్లాలో మొత్తంగా 711 చెరువుల్లో 2.82కోట్ల సీడ్ వదిలాం. ఇప్పటికే చెరువుల్లో వదిలిన చేపలు అరకిలో వరకు సైజ్ పెరిగాయి. మార్చి, ఏప్రిల్ వరకు కిలో వరకు పెరిగి అవకాశం ఉంది. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో సుమారు తొమ్మిది వేల మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తున్నది. వారికి సబ్సిడీపై వాహనాలు, ఇన్‌పుట్స్ ఇవ్వడంతోపాటు బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

– రాజారాం, జిల్లా మత్స్యశాఖ అధికారి


# పార్కులా.. డంపింగ్ యార్డులా!

## పచ్చని చెట్లతో అలరారుతున్న సూర్యాపేట డంపింగ్ యార్డులు

- విభిన్నంగా కనిపిస్తున్న జమునానగర్, బాలెంల డంపింగ్‌యార్డులు
- ఆరేండ్లలోనే ఏపుగా పెరిగి పార్కును తలపిస్తున్న వైనం

డంపింగ్ యార్డు అంటే చెత్త కుప్పలు.. కంపుకొట్టే పరిసరాలు.. చూస్తేనే ఒళ్లు జలదరించేలా పరిసరాలు గుర్తుకు వస్తాయి.. కానీ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డంపింగ్‌యార్డులో మాత్రం ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు, నేలపై పరుపులా పేర్చిన పచ్చనిగడ్డి.. ఆహ్లాదాన్ని పంచే వాతావరణంతో పార్కును తలపించేలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమునానగర్, బాలెంల వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటితే అవి పెరిగి మహా వృక్షాలుగా మారి అడవిని తలపిస్తున్నాయి.

– సూర్యాపేట, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ)



బాలెంల డంపింగ్ యార్డులో పెరిగిన పచ్చదనం

### ఫలితాలనిస్తున్న హరితహారం

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆరేండ్ల క్రితం జమునానగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో, మూడేండ్ల క్రితం బాలెంల వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో మున్సిపల్ పాలక వర్గం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా వేలాది మొక్కలు నాటారు. సదరు మొక్కలు నేడు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. ఆయా డంపింగ్ యార్డుల్లో చెత్తను ఎప్పటికప్పుడు సెగ్రిగేషన్ చేయడంతో పాటు ఎరువులను తయారు చేస్తుండడంతో దుర్వాసన లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా దర్శన మిస్తున్నాయి. దీనికి తోడు మొక్కలు ఏపుగా పెరగడంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తున్నది. మున్సిపల్ పాలకవర్గం, సిబ్బంది కృషితో డంపింగ్ యార్డు పచ్చని పార్కుగా మారడంతో పరిసర ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### నాటుకున్న లక్షలాది మొక్కలు

తెలంగాణ ఏర్పాటయ్యాక నిర్వహించిన హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి సంవత్సరం వేలాది మొక్కలు నాటారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు అనేది చూడకుండా అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎడారిగా మారిన అటవీ భూములు హరితహారం కార్యక్రమం ద్వారా నేడు మొక్కలు పెరిగి పచ్చగా దర్శనమిస్తున్నాయి. దాంతో పాటు జాతీయ రహదారులు, గ్రామీణ రోడ్లు, అంతర్గత రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడంతో నేడు అవి ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. 2014కు ముందు జిల్లాలో అటవీప్రాంతం ఒక శాతం కూడా లేకపోగా హరితహారం ద్వారా నాటిన మొక్కలు, పల్లె, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటుతో నేడు 11 శాతానికి పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.



జమునానగర్ డంపింగ్ యార్డులో ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలు

# అవగాహనతోనే అధిక దిగుబడులు

రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచించారు. ఎరువులు, పురుగుల మందులను మోతాదుకు మించనీయవద్దని.. అలా చేస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచిస్తున్నారు.

– గరిడేపల్లి, డిసెంబర్ 15



గరిడేపల్లిలో పూత దశలో ఉన్న మొక్క జొన్న చేను





## సమయానుకూలంగా ఎరువులు వేయాలి

- అవసరమైన మేరకే పురుగు మందు పిచికారీ
- అతిగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే ఎక్కువ

### మొక్కజొన్న పంటకు..

యాసంగి పంటగా నవంబర్ 15 లోపు విత్తిన మొక్కజొన్న పైరు 30 నుంచి 35 రోజులలోపు వయస్సున్నప్పుడు అంతరకృషి చేసి హెక్టారుకు 75 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువులు వేయాలి. ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగిన తేమ ఉండేలా చూసుకోవాలి. 30 నుంచి 40 రోజులున్న పైరుకు అధిక నీరు హానీకరం. కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగులు ఎక్కువగా యాసంగి మొక్కజొన్నను ఆశిస్తాయి. పైరు మొలకెత్తిన 20 నుంచి 25 రోజుల నుంచి ఇవి ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు మోనోక్రోటోపాస్ ఎకరాకు 320 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకు సుడులలో వేయాలి.

### కంది చేలల్లో..

వానకాలం పంటగా వేసిన దీర్ఘకాలిక కంది రకాలు ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్నాయి. వీటికి శనగపచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తాయి. శనగపచ్చ పురుగు నివారణకు తొలిదశలో క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు, క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లేదా ఎసిఫేట్‌ను 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగు ప్రభావం తగ్గకుంటే ఇండాక్సికార్బ్ 1 మి.లీ లేదా 0.3 మి.లీ స్పైనోసాడ్ లేదా 0.3 మి.లీ క్లోరంత్రనిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### మారుకామచ్చల పురుగు నివారణకు..

ఈ పురుగు ఆకులను, పూతను ఒక దగ్గరకు చేర్చి గూడుగా మార్చి పంటకు నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీలు, 1 మి.లీ డైక్లోరోవాస్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే థయోడికార్బ్ 1 గ్రాము లేదా స్పైనోసాడ్, ఫ్లూ బెండమైడ్ 0.3 మి.లీల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### శనగ పంటలో..

యాసంగిలో సాగు చేసిన శనగ పంటకు ఈ నెలలో సాధారణంగా పచ్చపురుగు లేదా రబ్బరు పురుగు ఆశించి నష్టం కలిగిస్తుంది. వీటి నివారణకు తొలిదశలో 2.5 మి.లీల క్లోరోపైరిఫాస్ లేదా 2 మి.లీల క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే స్పైనోసాడ్ 0.3 మి.లీలు లేదా డై ఫ్యూ బెంజురాన్ 1 మి.లీలు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి లేదా 2 సార్లు పిచికారీ చేయాలి.

### పొద్దు తిరుగుడు



ఆరుతడి పంటగా నవంబర్‌లో వేయడానికి వీలుగానీ పరిస్థితులలో ఈ నెలలో పొద్దు తిరుగుడును విత్తుకోవచ్చు. హైబ్రిడ్ రకాలను సాగు చేసుకోవడం మంచిది. కేబీఎస్ హెచ్-44, ఎన్‌డీఎస్‌హెచ్-1, డీఆర్ఎస్‌హెచ్-1, ఏపీఎస్‌హెచ్-66 రకాలు అనువైనవి. నవంబర్‌లో విత్తిన పైరుకు 30 నుంచి 35 రోజుల్లో హెక్టారుకు 40 కిలోల నత్రజని ఎరువులు వేయాలి.

### వేరు శనగ

అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేసిన వేరుశనగ పైరు ప్రస్తుతం పూతదశలో ఉన్నందున చివరిసారిగా అంతరకృషి చేసి హెక్టారుకు 500 కిలోల జిప్సంను 5 సెం.మీల లోతులో మొక్క దగ్గర వేసి మట్టితో ఎగదోయాలి. అనంతరం నీరుపెట్టాలి.

### కుసుమ పంట..

కుసుమ పంటకు విత్తిన 40 నుంచి 45 రోజుల వరకు పేను తాకిడి చాలా ప్రమాదకరమైంది. దీని నివారణకు డైమిథోయేట్ 2 మి.లీలు లేదా మోనోక్రోటోపాస్ 1.6 మి.లీలు లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు పంట వేసిన 20 రోజుల నుంచి పూత దశ వరకు ఆశిస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

### తెగుళ్లను గుర్తించి మందులు పిచికారీ చేయాలి



రైతులు సాగు చేస్తున్న పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. పంటలకు ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లను గుర్తించి రైతులు అందుకు అనుగుణంగా మందులు ఎంపిక చేసుకొని పిచికారీ చేయాలి. మందుల పిచికారీలో సరియైన విధానాలను అవలంభించాలి. అప్పుడే వాటి ప్రభావం తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చు.

– దొంగరి నరేశ్, కేవీకే ఇన్‌చార్జి పీసీ, గడ్డిపల్లి